



ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, చిత్రంలో మంత్రులు మండిపల్లి, సవిత, ఎమ్మెల్యేలు

ఎన్టీఆర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు.. చిత్రంలో ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆదినారాయణరెడ్డి, పుట్టాసుధాకర్ యాదవ్, ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి, లింగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు



మైదుకూరులో వెలుతుర్ల విష్ణువందన, వీరప్రసాద్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



హైటెక్నాలజీతో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న సీఎం

సీమ రైతులు
మీసం మెలేసేలా చేస్తా

- ప్రాజెక్టులు పూర్తి చేసి.. హార్టికల్చర్ హబ్‌గా మారుస్తా
- కొప్పర్తిలోనే ఎంఎస్ఎంఈ ఉంటుంది
- రాజోలి ద్వారా 95వేల ఎకరాలకు సాగునీరు
- కడపలో ముఠా కక్షలు నిర్మూలించింది నేనే
- కడప ఎయిర్‌పోర్టు నుంచి ప్రధాన నగరాలకు త్వరలో విమానాలు
- ఎన్టీఆర్ హయాంలోనే ఉమ్మడి కడప జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం
- వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో..
- పది అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు గెలిపించండి
- కడపలో ఆరు నెలల్లో టీడీపీ సొంత కార్యాలయం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

కడప, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి సీమరైతులు మీసం మెలేసేలా చేస్తానని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. కడప జిల్లాను సమగ్రాభివృద్ధి చేస్తామని, జిల్లాను అటు పరిశ్రమలకు స్మార్ట్‌సిటీగా, పండ్లతోటలకు హబ్‌గా మారుస్తామన్నారు. అసలు కరువు నేల రాయలసీమలో ఎన్టీఆర్ హయాంలోనే బీడు భూములకు నీళ్లందించేందుకు ప్రాజెక్టులకు అంకురార్పణ చుట్టారని అన్నారు.

శనివారం మైదుకూరులో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు, స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాంలోనే జిల్లాలో తెలుగుగంగ, గండికోట, గాలేరునగరి, సాగునీటి ప్రాజెక్టులతో పాటు ఆర్టీపీపీ ప్రాజెక్టు పురుడు పోసుకుందన్నారు. వైసీపీ నేతలు కథలు చెప్పడం తప్పక జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. నీటి ప్రాజెక్టులకు అంకురార్పణ చేసింది టీడీపీనే అన్నారు. వరి పండించడంకంటే పండ్లతోటలు సాగు చేస్తే నాలుగింతల ఆదాయం వస్తుందన్నారు. తన హయాంలోనే 90 శాతం సబ్సిడీతో మైక్రో ఇరిగేషన్ డ్రిప్ ఇరిగేషన్ తీసుకువచ్చామన్నారు. అది వైసీపీ హయాంలో నిలిపివేశారని అయితే ఇప్పుడు మళ్లీ తీసుకువచ్చామని అన్నారు.

రాజోలి రిజర్వాయరు తండ్రీకొడుకులు పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారని అయితే వైసీపీ హయాంలో ఏమీ చేయలేదన్నారు. దీన్ని పూర్తి చేసి 95వేల ఎకరాలకు సాగునీరందిస్తామని హామీ ఇచ్చారు. కడపలో ఒకప్పుడు ముఠాకక్షలుండేవని వాటిని తన హయాంలోనే అణిచివేశామన్నారు. కడప ఎయిర్‌పోర్టుకు మహర్దశ తన హయాంలోనే ఏర్పడిందన్నారు. రన్‌వే విస్తరణ, నైట్‌ల్యాండింగ్, ఎయిర్‌పోర్టు విస్తరణ అప్పుడే జరిగిందన్నారు. వైసీపీ హయాంలో ఫ్లైట్లు రాక మూతపడిందని. అయితే కూటమి వచ్చాక ఇప్పుడు ఫ్లైట్లు తిరుగుతున్నాయన్నారు. ఇక రాబోవు రోజుల్లో కడప ఎయిర్‌పోర్టు నుంచి ఎక్కడికైనా వెళ్లిరావచ్చన్నారు.

గండికోటను అభివృద్ధి చేస్తాం

గండికోట ప్రపంచంలోనే అందమైన టూరిజం ప్రాజెక్టుల్లో ఒకలని, దీన్ని అభివృద్ధిపరుస్తామని అన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ.80 కోట్లు మంజూరు చేసిందని.. దీంతో అభివృద్ధి చేస్తే ఇక్కడకు వచ్చే పర్యాటకులతో రోజూ ఉపాధి పెరుగుతుందన్నారు.

హార్టికల్చర్ హబ్‌గా మారుస్తా

మన జీవనాడి పోలవరం పూర్తయితే అక్కడ నుంచి సముద్రంలో వృథాగా పోతున్న 300 టీఎంసీల నీటిని రాయలసీమకు తీసుకువస్తే ఇక్కడ రైతులు మీసం మెలేసే రోజులు త్వరలోనే ఉన్నాయన్నారు. ఇక్కడికి నీరు వస్తే రాయలసీమ అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. గ్రోత్‌లో కడప, అనంతపురం ముందుకు వస్తున్నాయని.. ప్రాజెక్టులు పూర్తయితే కడప జిల్లా హార్టికల్చర్ హబ్‌గా మారి రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. ఇక కొప్పర్తిలో ఉన్న ఎంఎస్ఎంఈ ప్రాజెక్టును తరలించమని, అది ఇక్కడే ఉంటుందని హామీ ఇచ్చారు.

కోటి సభ్యత్వాలతో రికార్డు

కార్యకర్తలే శ్రీరామరక్ష అన్నారు. నారాలోకేశ్ జాతీయ కార్యదర్శి అయిన తరువాత సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. కోటి సభ్యత్వాలతో రికార్డు సృష్టించారని తెలిపారు. రూ.130 కోట్లతో బీమా అమలు చేస్తున్నామన్నారు. టీడీపీకి కార్యకర్తలు ప్రాణంతో సమానం అన్నారు. అవినీతిని ప్రశ్నించినందుకు నందం సుబ్బయ్యను ప్రొద్దుటూరులో బలిగొన్నారన్నారు. కడపలో ఆగస్టు 15నాటికి సొంత పార్టీ ఆఫీసును నిర్మించనున్నామన్నారు. ఇక మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారని, వాటిని ప్రాముఖ్యతపరంగా పూర్తి చేస్తామన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

1982లో దివంగత ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి అంతా టీడీపీతోనే సాధ్యమైందని అన్నారు. సంక్షేమం, అభివృద్ధితో పాటు సాగునీటి ప్రాజెక్టులు, ఎంతోమంది రాజకీయ భిక్ష టీడీపీలో జరిగిందన్నారు. కిలో రూ.2 బియ్యం, జనతా వస్త్రాలు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు ఎన్టీఆర్‌తోనే సాధ్యమయ్యాయన్నారు.

రాజకీయంగా బీసీల ఎదుగదల ఎన్టీఆర్‌తోనే..

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాంలోనే కడపజిల్లాకు సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభం అయ్యాయన్నారు. బీసీల అభివృద్ధికి రాజకీయంగా సంక్షేమ పథకాలు అందించింది ఆయనతోనే అన్నారు. ఇక మైదుకూరులో వంద పడకల ఆసుపత్రి, ప్రభుత్వ కళాశాల భవనాల నిర్మాణం, మార్కెట్‌యార్డు ఇతర వాటి నిర్మాణాలు మైదుకూరులో సిమెంటురోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం వంద కోట్లు కేటాయించండి అని కోరారు. ఇక్కడ మున్సిపాలిటీలో మౌలిక వసతులు కోసం వంద మంది సిబ్బందిని నియమించాలంటూ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, మంత్రి రాంప్రసాద్ రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు పుట్టాసుధాకర్‌యాదవ్, ఆర్.మాధవి, ఎన్.వరదరాజులరెడ్డి, పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు లింగారెడ్డి, విజయమ్మ, బద్వేలు ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, టీడీపీ యువ నాయకులు చెరుకూరి రవికుమార్, మాచుపల్లె క్రిష్ణారెడ్డి, అమీర్‌బాబు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభకు హాజరైన జనం







గ్రీన్ ఎనర్జీ గురించి సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న విద్యార్థులు



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న విజయమ్మ రితీష్‌కుమార్‌రెడ్డి

స్వచ్ఛాంధ్ర ఉద్యమంలా సాగాలి

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

6

స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

కడప సెవెన్ రోడ్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వీధులను శుభ్రపరుస్తూ మురికి కాల్వను క్లీన్ చేస్తూ ప్రభుత్వ అధికారులు గ్రామాలకు వచ్చినపుడు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు నెలనెల జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్వచ్ఛభారత్ పేరుతో కోట్ల రూపాయల నిధులు పక్కదారి పట్టించి నాసిరకం యంత్రాలు సరఫరా చేయడంతో అవన్నీ మూలనపడి స్వచ్ఛత జాడ కానరాలేదని పల్లెలు బాగుపడలేదని.. నేడు జనం మాత్రం రోగాల బారిన పడి అల్లాడుతున్నారన్నారు. జిల్లాలో కొన్ని పంచాయతీలలో ఇప్పటికీ స్వచ్ఛభారత్ కార్మికులకు 10 నుంచి 16నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు బాదుల్లా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు తోడ్పడండి

- ఆర్జేడీకి యూటీఎఫ్ వినతి

కడప ఎడ్యుకేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి, పరిరక్షణకు పాటుపడాలని పాఠశాల విద్య ఆర్జేడీ కె.శామ్యూల్‌కు యూటీఎఫ్ కడప జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. పాఠశాల విద్య కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది బాధ్యతలు చేపట్టిన కె.శామ్యూల్‌ను శనివారం ఉదయం కడపలోని ఆర్జేడీ కార్యాలయంలో యూటీఎఫ్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేశ్‌బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరిప్రసాద్, ఎస్.జాబీర్ పాఠశాల విద్య నూతన ఆర్జేడీతో మాట్లాడుతూ పాలకులు విద్యారంగంలో ప్రవేశపెట్టిన సంస్కరణల వల్ల ప్రభుత్వ విద్యా రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. ప్రత్యేకించి ప్రాథమిక విద్యారంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందన్నారు. సంస్కరణలు ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చినట్లుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు దిలీప్ చక్రవర్తి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో టూరిజంను దోచుకున్నారు

- రాష్ట్ర టూరిజం చైర్మన్ నూకసాని బాలాజి

బి.కొత్తకోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో టూరిజం శాఖను భ్రష్టుపట్టించి, ఎవరి స్థాయిలో వారు దోచుకున్నారని రాష్ట్ర టూరిజం చైర్మన్ నూకసాని బాలాజి పేర్కొన్నారు. ఒకరోజు పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం రాత్రి బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వచ్చారు. శనివారం హార్సిలీహిల్స్‌పై నున్న గాలిబండ, ఏరియల్ వ్యూపాయింట్, గవర్నర్ బంగ్లా, ఏపీ టూరిజం రెస్టారెంట్, గెస్ట్ హౌస్‌లు, కాన్ఫరెన్స్ హాల్ తదితర ప్రదేశాలలో తిరిగి పరిశీలించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టూరిజంశాఖ నిదులు రూ. కోట్లలో దుర్వినియోగమయ్యాయని, కొన్ని తప్పుడు నిర్ణయాలతో నిదులు పక్కదారి పట్టాయని, దీనిపై విచారణ జరిపి పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలలో హార్సిలీహిల్స్‌కు ప్రత్యేకత ఉందని, ఇక్కడ పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. హరిత రెస్టారెంట్, బార్, కాన్ఫరెన్స్ హాల్, గెస్ట్‌హౌస్‌లను ఆధునీకీకరించడంతో పాటు, అడ్వంచర్స్‌ను పెంచుతామన్నారు. హార్సిలీహిల్స్ ప్రైవేటీకరణ జరుగుతుందని వస్తున్న వదంతులలో నిజంలేదని, అలాంటి ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఒబెరాయ్ హోటల్ నిర్మాణం జరిగితే హార్సిలీహిల్స్‌కు జాతీయస్థాయి గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పల్లవితో కలిసి హిల్స్‌పై నిర్వహించిన స్వచ్ఛతా ర్యాలీ లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర చైర్మన్ వెంట హిల్స్ టూరిజంశాఖ మేనేజర్ సాల్విన్‌రెడ్డి, మహేష్ తదితరులున్నారు.

స్వచ్ఛాంధ్ర ర్యాలీలో సీఎం

మైదుకూరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు శనివారం మైదుకూరులో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన రాయల్ కూడలి నుంచి వినాయకనగర్ వరకు చేపట్టిన ఈ ర్యాలీలో విద్యార్థులతో కలసి పాల్గొన్నారు. సీఎం తోపాటు రాష్ట్ర మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సబిత, స్వచ్ఛాంధ్ర రాష్ట్ర చైర్మన్ పట్టాభిరామ్, ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్‌యాదవ్, ఆదినారాయణ రెడ్డి, కృష్ణ చైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, ఆర్.మాధవి, ఇన్‌చార్జిలు భూపేశ్‌రెడ్డి, బీటెక్ రవి, రితేశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు లింగారెడ్డి, విజయమ్మ, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఆర్డీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు. రాయల్ సర్కిల్ నుంచి ర్యాలీగా హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. దారి వెంబడి మైదుకూరు ప్రజలు సీఎంకు జై చంద్రబాబుకు జై అంటు నీరాజనాలు పలికారు. పిల్లలు ఇబ్బందులు పడకుండా చూడాలని తన సెక్యూరిటీ సిబ్బందిని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మైదుకూరులో మున్సిపాలిటీకి చెత్త సేకరణకు ఒక కొత్త ఆటోను, 14 టన్నుల కెపాసిటీ కలిగిన కంపాక్ట్ వాహనానికి సంబంధించిన తాళాలను మైదుకూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డికి సీఎం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు భీమయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు యాపరాల చిన్న, రమణ, కిశక్షర్, ఏపీ రవీంద్ర, ఆకుల కృష్ణయ్య, చెరుకూరి రవికుమార్ నాయుడు, మాచుపల్లి కృష్ణారెడ్డి, ఆర్.శ్రీనివాసులు, కటారి కృష్ణ, పొలిమేర శివశంకర్‌రెడ్డి, కిషోర్ యాదవ్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



కంపాక్ట్ వాహనానికి సంబంధించిన తాళం అందజేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

సీఎం సభ విజయవంతం

చాపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మైదుకూరులో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సభ విజయవంతమైందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి అన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సభలో పాల్గొన్న సీఎం నారా చంద్రబాబునాయుడు మైదుకూరు అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పడం హర్షించదగ్గ విషయమన్నారు. సీఎం పట్ల ప్రజలకు నమ్మకం ఏర్పడిందన్నారు. కాగా.. హెలిప్యాడ్‌లో చంద్రబాబునాయుడికి మునిశేఖర్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

అందరికీ అండగా ఉంటాం

ప్రతి పేద కుటుంబానికి తాము అండగా ఉంటామని సీఎం చంద్రబాబు అన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ కార్యాలయానికి ఎదురుగా నివాసముంటున్న వెలుతుర్ల విష్ణువందన, వీరప్రసాద్ నివాసానికి సీఎం వెళ్లారు. వారి ఇంట్లో తడిపొడి చెత్తతో తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువులతో సాగు చేసిన పెరటితోటను పరిశీలించారు. వారి ఆర్థిక స్థితి గతుల గురించి అడిగి తెలుసుకొన్నారు. వారు వైద్య పరంగా, ఆర్థిక పరంగా సాయం చేయాలని కోరారు. కాగా వీరప్రసాద్ వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నారు. వారిని ఆదుకుంటామని సీఎం అన్నారు.




స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలో విద్యార్థులతో కలిసి పాల్గొన్న సీఎం

స్వచ్ఛాంధ్ర ఉద్యమంలా సాగాలి



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవితంలో వెలుగు నింపడమే తన బాధ్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంగా ఉద్యమంలా సాగాలని పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం మైదుకూరులో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈరోజు ఒక చరిత్రకు శ్రీకారం చుట్టామన్నారు. స్వచ్ఛాంధ్ర సామాజిక సేవా కార్యక్రమాల్లో అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉండగా 95-96లో పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునివ్వడంతో పరిసరాల పరిశుభ్రతకు శ్రీకారం చుట్టామన్నారు.

ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర ఉద్యమం

ప్రతి నెల మూడో శనివారం కార్యాలయంలోని సిబ్బంది, విద్యార్థులు ప్రతి ఒక్కరు స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో పాల్పంచుకోవాలన్నారు. కొన్ని తరాలు శ్రమపడితే తప్ప మార్పు వచ్చే అవకాశం లేదన్నారు. ప్రతి ఒక్కరు మైండ్ సెట్‌ను మార్పు చేసుకోవాలన్నారు. బాడీని కంట్రోల్‌లో ఉంచుకోవడం వల్ల ఆరోగ్యం కలుగుతుందన్నారు. మొదట ఇళ్లు చక్కగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆ తర్వాత పరిసరాలను పరిశుభ్రంగా

● సీఎం నారా చంద్రబాబునాయుడు

ఉంచుకోవాలన్నారు. పిల్లలు పెద్దల్లో పర్యావరణంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించవచ్చనేది నిరూపణ చేశామన్నారు. చెత్త నుంచి కరెంటు ఉత్పత్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో 85లక్షల మెట్రికల్ టన్నుల చెత్తను వదిలేసిందన్నారు. అక్టోబరు 2వ తేదీ నాటికి ఈ చెత్త ద్వారా సంపద సృష్టించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాను వచ్చి వెళ్లిన తర్వాత సీబీఎన్ మార్క్ కనపడాలని పేర్కొన్నారు. రాష్ట్రమంతా స్వచ్ఛంగా ఉండాలనేదే తన ఆశయం అన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

పరిసరాల పరిశుభ్రతలో మంచి ప్రతిభ కనబరచిన పారిశుధ్య కార్మికులు చెన్నమ్మ, అమ్ములమ్మ, గంగాధర్‌తో పాటు రాష్ట్రపతి అవార్డు అందుకున్న అనకాపల్లె జిల్లాకు చెందిన పంచాయతీ కార్యదర్శి త్రినాథ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సత్కరించారు. సీఎం మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల క్యాష్ అవార్డులు కూడా ప్రకటించారు. కడపకు చెందిన అలేఖ్య మాట్లాడుతూ ఇంటి నుంచి వచ్చే చెత్తను కంపోస్ట్ ఎరువుగా తయారు చేసి మిద్దె తోట ద్వారా కూరగాయలు పండించుకుంటున్నామన్నారు.

మైదుకూరులో మోడల్‌గా..

మైదుకూరులో మోడల్‌గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మైదుకూరులో ఏడు కిలోమీటర్ల మేర పట్టణ పరిధిలో, ఐదు కిలోమీటర్లు గ్రామీణ పరిధిలో సీసీ బీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా వందశాతం మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను తీసుకొస్తామన్నారు. డ్రైనేజీ వాటర్ శుభ్రపరిచి చెరువులు నింపే విధానాన్ని తీసుకొస్తామన్నారు. ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటుచేసే దానికోసం స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అమృత్ కింద రూ.90కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు అందరికి ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. అదేవిధంగా రాయితీపై సోలార్ విద్యుత్‌ను ఏర్పాటుచేస్తామని తద్వారా కరెంట్ బిల్లులు కట్టే పరిస్థితి లేకుండా ఉంటుందన్నారు. దీపం-2 ద్వారా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని, మైదుకూరులో ఇంటికి పైపుల ద్వారా గ్యాస్ కనెక్షన్ ఇచ్చే పనిని కూడా చేపడుతామన్నారు.

కూటమి విజయం ప్రజలదే

గత ఏడాదిలో జరిగిన ఎన్నికల్లో కూటమికి చెందిన 93శాతం మంది అభ్యర్థులను గెలిపించిన ఘనత ఈ రాష్ట్ర ప్రజలదేనన్నారు. ఈ క్రమంలోనే కేంద్రంలో మన పరపతి పెరిగిందని రాష్ట్రానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జిల్లాలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి కోసం రూ.2200కోట్లు నిధులు కేటాయించారన్నారు. దీనితో పాటు రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు భారీస్థాయిలో నిధులు కేటాయించారన్నారు. ఎన్టీఆర్ పింఛన్ పథకం కింద ఏడాదికి రూ.33వేలకోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్‌సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామన్నారు.





కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాట్లాడుతున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రతినెల మూడు శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించడం సంతోషకరమన్నారు. చెత్త సేకరణలో ఇప్పటి వరకు 80శాతం ప్రగతి సాధించామన్నారు. వచ్చే ఆరు నెలల్లో వందశాతం ప్రగతిని సాధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ వెంటిలేటర్ మీద ఉన్న రాష్ట్రాన్ని ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వం ఊపిరి పోసిందన్నారు. దీనితో సంతోషంగా రాష్ట్రంలోని ప్రజలు సంక్రాతి పండుగను జరుపుకొన్నారన్నారు. గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేస్తే ఈ ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టిస్తుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని, అమరావతి, పోలవరం పనులు ఊపందుకుంటున్నాయని ఆమె పేర్కొన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ మైదుకూరు నుంచి ఒక కార్యక్రమానికి అంకురార్పణ చేస్తున్నామన్నారు. దేశంలో ఏ ఒక్క రాష్ట్రం చేపట్టని క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని గతంలో ప్రారంభించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. స్వచ్ఛభారత్ ఏర్పాటు అయ్యాక స్వచ్ఛభారత్ అభియాన్‌కు చంద్రబాబునాయుడు నాయకత్వం వహించారన్నారు. 2047లోపు రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆయన వివరించారు. వెయ్యి టన్నుల చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుదాకర్‌యాదవ్ మాట్లాడుతూ మైదుకూరుకు ముఖ్యమంత్రి రావడంతో ఒక పడుగ వాతావరణం ఏర్పడిందన్నారు. వ్యాపారంలో ఉన్న తనను రాజకీయాలకు తీసుకొచ్చి ఎమ్మెల్యేను చేసిన చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటానన్నారు. రాజోలి నిర్మాణానికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. బ్రహ్మంగారిమఠంను టూరిజం హబ్‌గా చేయాలని మరిన్ని నియోజకవర్గ సమస్యలపై ముఖ్యమంత్రికి విన్నవించామన్నారు. ముందుగా స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవి, కృష్ణచైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ప్రొద్దుటూరు బద్వేలు మాజీ ఎమ్మెల్యేలు లింగారెడ్డి, విజయమ్మ, జమ్మలమడుగు, బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జిలు భూపేష్‌రెడ్డి, రితీష్‌రెడ్డి, ఆప్కో మాజీ చైర్మన్ గుజ్జల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, సీఎంకు సమస్యలను వివరిస్తున్న ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, స్వచ్ఛతా ర్యాలీ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 26 కేంద్రాలు

● 4242 మంది విద్యార్థులు హాజరు



మాయాబజారులోని మున్సిపల్ వివేకానంద హైస్కూల్‌లో నవోదయ పరీక్షలు రాయడానికి లోపలికి వెళుతున్న విద్యార్థులు

మదనపల్లె అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు 26 కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించినట్లు వలసపల్లె నవోదయ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేలాయుధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నిర్వహించిన నవోదయ పరీక్షలకు 5058 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 4242 మంది హాజరై పరీక్షలు రాశారన్నారు. 816 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష సమయానికి అరగంట ముందుగానే పరీక్షల కేంద్రంలోనికి విద్యార్థులను అనుమతించారు. మదనపల్లెలో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో రెండు పరీక్ష కేంద్రాలను, పట్టణంలోని నీరుగుట్టువారిపల్లెలో మాయాబజార్‌లోని మున్సిపల్ వివేకానంద హైస్కూల్ ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి పర్యవేక్షించారు. మయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం పురం వెంకటరమణ ఆధ్వర్యంలో నవోదయ పరీక్షలు రాసే విద్యార్థులను పరిశీలించి లోనికి అనుమతి ఇచ్చారు.

నడిరోడ్డుపై ఆగిన ఆర్టీసీ బస్సు

● గంటల తరబడి ట్రాఫిక్ జామ్



నిలబడిపోయిన బస్సును తోస్తున్న ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పీలేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాయచోటి పట్టణం బస్టాండు వద్ద మొరాయించింది. ఈ బస్సులో దాదాపు 20 మంది ప్రయాణికులు ఉండగా బస్సు దారిలో నిలబడిపోవడంతో ఇటు నుంచి వెళ్లే వాహనాలకు చాలా ఇబ్బంది కలిగింది. ఈ బస్సు పీలేరు నుంచి రాయచోటికి వస్తుండగా ఆగిపోయినట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. కాగా బస్సు కండీషన్‌ను సరిచూడకుండా ఎలా నడుపుతారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్ఎం రామును వివరణ కోరగా.. పీలేరుకు సంబంధించిన బస్సు నిలబడిపోయిన మాట వాస్తవమేనని, ఆ బస్సు చాలా రోజుల నుంచి రిపేరులో ఉందని, వీలైనంత త్వరలో తయారు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

ఆర్టీసీ బస్సులో మంటలు..

● ఆర్పివేసిన స్థానికులు

సిద్దవటం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నుంచి చెన్నైకి వెళుతున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ప్రయాణికులను ఎక్కించుకునేందుకు పులివెందుల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భాకరాపేటలో నిలపగా, ఒక్కసారిగా రేడియేటర్ నుంచి మంటలు రేగాయి. దీంతో డ్రైవరు బస్సు ఇంజన్‌ను ఆఫ్ చేశారు. విషయం గమనించిన స్థానికులు బిందెలతో నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనతో హైవేపై దాదాపు 20 నిముషాల పాటు వాహనాలు నిలిచిపోయారు. ఈ విషయమై ఏఎస్ఐ సుబ్బరామచంద్రను మాట్లాడుతూ ఈ బస్సులు 18 మంది ప్రయాణికులుండగా, వారందరినీ వేరే బస్సుల్లో గమ్య స్థానాలకు చేర్చామని తెలిపారు.

మిరప రైతు కంట కన్నీరు

● వైరస్, తెగుళ్లతో తగ్గిన దిగుబడి

మైలవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన మిరప పంట ఈ ఏడాది రైతుకు కన్నీటిని మిగిల్చింది. వాతావరణంలో మార్పు, వైరస్, తెగుళ్లు, చీడ పీడల బెడద, మార్కెట్‌లో ధరలు తగ్గుదల వంటివి మిరప రైతుకు తీవ్ర నిరాశను మిగిల్చాయి. సాగు చేసిన మిరప పంటకు అప్పులకు వెనుకాడకుండా ముందుకు సాగి తీవ్ర నష్టాలతో మునిగామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాధారం, బోరు, బావుల కింద మండలంలో దాదాపు 3 వేల ఎకరాలకు పైగా మిరప పంట సాగైంది. తేజ రకం, నెంబరు 5 మిరప రకాన్ని ఎక్కువగా సాగు చేశారు. గత ఏడాది ఆగస్టు నుంచి మిరప పంట సాగు చేశారు. మిరప నారు నాటినప్పటి నుంచి సేద్యాలు, ఎరువులు, మందుల పిచికారి చేస్తూ పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. అయితే వాతావరణం మార్పులతో వైరస్ సోకడం, తెగుళ్లు, నల్లి, కాయకుళ్లు, పంటపై తీవ్ర ప్రభావం చూపింది. కాయదశలో వాతావరణం మార్పుతో కాయపై మచ్చ ఏర్పడింది. దీంతో కాయ నాణ్యత దెబ్బతిని తాలు ఎక్కువైంది. పంట కోతకు సమానంగా కల్లాల్లో కాయల గ్రేడింగ్‌కు ఖర్చు అవుతుందని మిరప రైతులు అంటున్నారు. ఈ ఏడాది మిరప పంటలో తేజ రకం ఎకరాకు 10-13 క్వింటాళ్లు, నెం.5 కూడా అంతే దిగుబడి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి ఎక్కువ కావడంతో ఎకరా మిరప పంట సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. మిరప పంట మంచి దిగుబడి, గిట్టుబాటు ధర లభిస్తే లాభాలు వస్తాయి. అయితే ప్రస్తుతం మార్కెట్ ధరలు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. గత సంవత్సరం పంట దిగుబడి వచ్చే సమయానికి ధరలు అమాంతంగా పడిపోవడంతో ఎక్కువ మంది రైతులు మిరపకాయలను ఏసీ గోడౌన్లలో నిలువ చేసుకున్నారు. మంచి ధర వస్తే అమ్మాలని రైతులు ఎదురుచూస్తున్నారు. రైతుల ఆశలపై నీళ్లు చల్లేలా రోజు రోజుకు ధరలు మరింత దిగజారాయి. రెండేళ్ల క్రితం వరకు తేజా రకాలు రూ.20 నుంచి రూ.25 వేల వరకు ధర పలికాయి. ప్రస్తుతం సగం ధర కూడా అందడం లేదని రైతులు అంటున్నారు. ఈ ధరలకు పంటను అమ్మితే పెట్టుబడి ఖర్చులు కూడా రావని మిరప పంటకు గిట్టుబాటు ధరలు లభించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



కల్లంలో గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



సాగుచేసిన మిరప పంట

తెగుళ్లతో మిరపకు దెబ్బ



- వెంకటేశు, రైతు

మిరప పంటలో వైరస్, వాతావరణ మార్పులతో తెగుళ్లతో తీవ్ర నష్టం వాటిల్లింది. తాలు కాయలు పెరగడంతో గ్రేడింగ్ చేసేటప్పుడు ఎక్కువగా తెల్లకాయలు వస్తున్నాయి. ఖర్చులు ఎక్కువై దిగుబడి అంతంత మాత్రంగా ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ధరలు పతనం



- జయరాం, రైతు

రెండేళ్ల క్రితం ఉన్న ధరలకు, ఇప్పటి ధరలకు చాలా తేడా ఉంది. రోజు రోజుకు ధరలు పతనమవుతున్నాయి. దీంతో ఆశించిన ఆదాయం వస్తుందో.. రాదో.

మీ కుటుంబంలో ఒక్కడిలా ఆదరించారు

● సినీనటుడు కిరణ్ అబ్బవరం

కురబలకోట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మీ కుటుంబంలో సొంతమనిషిలా ఆదరించారు. మీరు చూపిన ఆదరాభిమానాలు తన జీవితంలో వెలకట్టలేనివని సినీ నటుడు కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో దిల్ రుబా సినిమాకు డైరెక్టర్ విశ్వకరుణ్, హీరో హీరోయిన్లుగా కిరణ్ అబ్బవరం, రుక్సార్ ధిల్లాన్ నటించిన ఈ చిత్రం పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన నిజ జీవితంలో ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాన్ని సాధించడానికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా ప్రతిఒక్కరి జీవితంలో సాధించాలనే పట్టుదలతో ముందుకెళ్లాలన్నారు. చదువులో ఇంజనీరింగ్ పూర్తి చేసి, సినీ రంగంలో రాణిస్తున్నానన్నారు. మదనపల్లెతో తనకు విడదీయరాని అనుబంధం ఉన్నదని, పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు, ఇక్కడికి సినిమాలు చూడటానికి, షాపింగ్ చేయడానికి తరచూ వచ్చేవాడినన్నారు. తాను బెంగళూరులో ఉద్యోగం చేసేటప్పుడు ఈ మార్గంలో ద్విచక్రవాహనంలో వెళ్లేవాడినన్నారు. ఈ సినిమాలో రాయలసీయ ప్రాంతానికి చెందిన వారు నటించారని, ఇప్పటికే ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నదని, సినిమాను ఫిబ్రవరి 14న థియేటర్లలో రిలీజ్ చేస్తున్నామని చూసి ఆదరించాలని కోరారు. అనంతరం సినిమాలోని సాంగ్‌కు హీరో, హీరోయిన్‌తో పాటుగా మిట్స్ విద్యార్థులు డ్యాన్సులు వేసి పలువురిని ఆకట్టుకున్నారు. అలాగే విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేసి యువతను ఆకట్టుకున్నారు. అనంతరం వచ్చే నెలలో మిట్స్‌లో నిర్వహించే అశ్వ కార్యక్రమానికి సంబంధించి టీజర్‌ను హీరో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకనాథ్, వైస్ ప్రిన్సిపాల్ కమాల్‌బాషా, రామనాథం తదితరులు అభినందించారు.



డ్యాన్స్ చేస్తున్న కిరణ్ అబ్బవరం, రుక్సార్ ధిల్లాన్

హోరాహోరీగా సబ్‌జూనియర్ హాకీ టోర్నమెంట్



హాకీ టోర్నమెంట్ సెమీ ఫైనల్లో తలపడుతున్న కడప, తిరుపతి జట్లు

మదనపల్లెటౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో నిర్వహిస్తున్న అంతర్‌జిల్లా సబ్‌జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో హోరాహోరీగా వివిధ జిల్లాల జట్లు తలపడ్డాయి. శనివారం లీగ్ దశల్లో ప్రీ క్వార్టర్ ఫైనల్స్ నిర్వహించగా నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. ఇందులో తొలి సెమీఫైనల్లో తిరుపతి జట్టుపై కడప జట్టు 4-1 గోల్స్ చేసి ఫైనల్స్‌కు చేరుకుంది. అంతకు ముందు క్వార్టర్ ఫైనల్స్‌లో మొదటి క్వార్టర్ ఫైనల్స్‌లో కాకినాడపై కడప జట్టు, రెండో క్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీసత్యసాయి జిల్లా జట్టుపై తిరుపతి జట్టు, మూడో క్వార్టర్ ఫైనల్స్‌లో వెస్ట్ గోదావరి జట్టుపై అన్నమయ్య జిల్లా జట్టు, నాలుగో క్వార్టర్ ఫైనల్స్‌లో చిత్తూరు జట్టుపై అనకాపల్లె జట్టు గెలుపొంది సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజ్, కోశాధికారి థామస్, జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్, శివప్రసాద్, ప్రసాద్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ

పుల్లంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై పుల్లంపేటకు చెందిన నవీన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శనివారం ఉపాధిహామీ ఏపీడీ ప్రతాప్ విచారణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయంలో ఫిర్యాదుదారు. ఫీల్డ్ అసిస్టెంట్ సమక్షంలో విచారణ చేశారు. పుల్లంపేటకు చెందిన జె.ఉమ, ఆమె కుమారుడు దినేష్, ఉపాధి పనులకు వెళ్లకపోయినా, వారి పేరుతో కూలి మంజూరు కావడంతో వారిని కూడా విచారణ చేశారు. తమకు జాబ్‌కార్డులు ఉన్నట్లే తెలియదని, తమ కుమారుడు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడని, నిధులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు లిఖిత పూర్వకంగా ఏపీడీకి ఫిర్యాదు చేశారు. వలంటీర్ మాధవి ఉపాధి పనులకు వెళ్లినట్లు ఫిర్యాదులో ఉండడంతో ఆమెను కూడా పిలిచి విచారణ చేశారు. వలంటీర్ విధులు ఉన్న రోజుల్లో తప్ప, మిగతా రోజుల్లో ఉపాధి పనికి వెళ్లవచ్చని, అలా కాకుండా అన్ని రోజులు ఉపాధి కూలీగా పనిచేసినట్లు ఉంటే రికవరీ చేస్తామని ఏపీడీ తెలిపారు. ఇలాంటి ఫిర్యాదులు నిర్ధారణ అయిన సందర్భాల్లో, వలంటీర్ నుంచి రికవరీ చేసి, ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించామన్నారు. ఒకే రేషన్‌కార్డులో ఉన్న దంపతులకు రెండు వేర్వేరు ఐడీలు నమోదు చేసి నిధులు దుర్వినియోగం చేసిన అంశంపై కూడా ఏపీడీ విచారణ చేశారు. రికార్డులు పరిశీలించి నివేదికను అధికారులకు పంపుతామని ఏపీడీ తెలిపారు. ఈ విచారణలో ఏపీవో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమాలపై విచారణ చేస్తున్న ఏపీడీ

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



బారెడ్డి ఓబుల్‌రెడ్డి మృతదేహం

చెన్నూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతు బారెడ్డి ఓబుల్‌రెడ్డి (50) వ్యవసాయంలో అప్పులు పెరిగి, వత్తిళ్లు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఉప్పరపల్లె వాసి ఓబుల్‌రెడ్డి కొన్నేళ్లగా స్వగ్రామంలోనే వ్యవసాయం చేసేవాడు. పరిస్థితులు అనుకూలించకపోవడం, పంట చేతికి అందకపోవడం, అప్పులకు వడ్డీ పెరగడం, వత్తిడి తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడు. రోజూ అప్పుల వారి వత్తిల్లు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులతో చెప్పి మదనపడేవాడు. దీంతో ఆరోగ్యం కూడా దెబ్బతినింది. చివరికి ఆత్మహత్యే శరణ్యమనుకుని శుక్రవారం పెండ్లిమర్రి మండలం ఆరవేటిపల్లెలో మరదలు ఇంటికి వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. చీకటి పడ్డా కూడా ఇంటికి రాకపోవడంతో భార్య తులశమ్మ, కుమారుడు, కుమార్తె ఫోను చేశారు. ఎలాంటి సమాధానం రాకపోవడంతో వారు ఆందోళనకు గురయ్యారు. శనివారం ఉదయం హైవేలోని హజ్‌హౌస్‌కు దక్షిణ వైపు ఉన్న పాత అన్నక్యాంటీన్‌లో పురుగుల మందు తాగి మృతి చెంది ఉన్నాడని కనుగొన్నారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి

డాక్టరు నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబ సభ్యులు



రామయ్య మృతదేహం

పోరుమామిళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రామాయపల్లె వాసి కారు రామయ్య (45) వైద్యం వికటించి మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. రామయ్య మృతికి డాక్టరు నిర్లక్ష్యమే కారణమన్నారు. గురువారం రాత్రి రామయ్య కడుపు, ఛాతిలో మంటగా ఉందని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు పోరుమామిళ్లలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టరు అన్ని వివరాలు కనుక్కుని కడుపులో గ్యాస్ ఉందంటూ ఇంజక్షన్, ట్యాబ్లెట్లు, సిరప్ ఇచ్చాడు. తరువాత ఇంటికి వెళ్లిన రామయ్యకు వాంతులు ఎక్కువ కావడం, అస్వస్థతకు గురవడంతో కుటుంబీకులు మళ్లీ ఆస్పత్రికి తీసుకునివచ్చారు. డాక్టరు ఎంతసేపటికీ స్పందించకపోగా, చివరికి డాక్టరు పరీక్షించే సమయానికి అతను మృతి చెందాడని ధృవీకరించి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టరు నిర్లక్ష్యమే కారణమని, ఆస్పత్రి ఎదురుగా ఉన్న పోలీసులకు తెలిపారు. రామయ్య శవంతో రాత్రి నుంచి ఉదయం వరకు ఆస్పత్రిలోనే బైఠాయించారు. శుక్రవారం మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్‌ఐ కొండారెడ్డి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత మృతికి గల కారణాలు తెలిసే అవకాశం ఉంది.

ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ - ఒకరు మృతి



బాదుల్లా మృతదేహం

పెండ్లిమర్రి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కడప-పులివెందుల ప్రధానరోడ్డులో ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బాదుల్లా (50) మృతిచెందాడు. మిట్టమీదపల్లె వాసి బాదుల్లా 40ఏళ్లుగా చుట్టుపక్కల ప్రాంతాల్లో పరుపులు అమ్ముతూ, కుదుతూ జీవించేవాడు. రోజువారి పని నిమిత్తం వ్యాపారం చేసుకుని ఆటోలో జంగంరెడ్డిపల్లె, రంపతాడు రహదారి నుంచి కడప-పులివెందుల మెయిన్‌రోడ్డు ఎక్కుతుండగా పులివెందుల నుంచి కడపకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆటోపల్టీలు కొట్టి అందులో ఉన్న బాదుల్లాకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన కడప రిమ్స్‌కు 108లో తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందారు.

డ్రాఫ్ట్‌రూల్స్ అసంబద్ధాలను తొలగించాలి

- ఆర్జేడీకి పీఎస్‌టీయూ వినతి



ఆర్జేడీకి వినతిపత్రం సమర్పిస్తున్న పీఎస్‌టీయూ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బదిలీలు, రేషనలైజేషన్ చట్టబద్దత డ్రాఫ్ట్ రూల్స్‌లోని అసంబద్దాలను తొలగించాలని లేకపోతే వేలాదిగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సర్‌ప్లస్ అవుతారని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జమాల్‌రెడ్డి కోరారు. శనివారం కార్యాలయంలో ఆర్జేడీ శామ్యూల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ 6,7,8 తరగతుల సెక్షన్ల విషయంలో ప్రస్తుతం విడుదల చేసిన డ్రాఫ్ట్ రూల్స్‌లో తీవ్ర అన్యాయం జరుగుతోందని వివరించారు. కేవలం ఆరుగురు విద్యార్థుల తేడాతో రాష్ట్ర వ్యాప్తంగా అనేక పాఠశాలలో మూడు సెక్షన్లు తగ్గి వేలాది స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ అవుతారన్నారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, సీపీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, రామలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

టీచర్ల పీఎఫ్ స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలి

జడ్పీ సీఈఓకు ఏపీటీఎఫ్ వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది ప్రావిడెంట్ ఫండ్ వార్షిక వివరాల స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఓబుళమ్మను కలిసి వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయులు 2023-24 పీఎఫ్ స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, పీఎఫ్ నెలవారీ జమలను ఆన్‌లైన్‌లో ఉంచాలని, పీఎఫ్ రుణాలను, ఫైనల్ పేమెంట్లను మంజూరు చేయడంలో జాప్యం లేకుండా చూడాలని, ఉన్నత పాఠశాలల్లోని నాన్‌టీచింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, టీచర్ల ఖాతాల కు జమకాని డీఏ మొత్తాలను వారి అకౌంట్లలో జమచేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

కారు కాల్చిన సంఘటనపై కేసు నమోదు

రాయచోటిటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్డీస్‌కాలనీలోని ఎర్ర మసీదు వద్ద శనివారం తెల్లవారుజామున కారును కాల్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... ఎర్రమసీదు ప్రాంత వాసి అఫ్సాన్‌పై జాహీద్ సహా మరికొందరు దాడి చేసి గాయపర్చారు. మిత్రుడు అఫ్సాన్‌పై ఇస్రాన్ రెండు రోజుల కిందట దాడి చేయించాడని అనుమానించిన నాసిర్ అలియాస్ డాకు, అబూజర్, గౌర్ మరొకరితో కలిసి శనివారం తెల్లవారుజామున ఎర్ర మెసేజ్ సమీపంలో తన ఇంటి ముందు నిలిపి ఉన్న స్కోడా కారుపై పెట్రోల్ పోసి తగలబెట్టారు. దీంతో బాధితుడు ఇస్రాన్ శనివారం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అర్బన్ సీఐ ఆధ్వర్యంలో ఎస్‌ఐ జహీర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం కారు దగ్ధం చేసిన గంజాయి బ్యాచ్ గతంలో కూడా చార్మినార్ హోటల్, అరేబియన్ హోటల్ ఎదురుగా స్పోర్ట్స్ సెంటర్, మయూర బేకరీ బిల్డింగ్ యజమాని రబ్బానిపైన, కొత్తపేట టాటూ సెంటర్‌పై సంఘటనలకు పాల్పడినట్లు సమాచారం.

నిధులొచ్చినా తప్పని అడ్డంకులు

'నాలుగులేన్ల' నిర్మాణానికి అటవీ అనుమతులు ?

ఆటంకాలు తొలిగేదెన్నడు? ● రైతులకు పరిహారం అందేదెప్పుడు



ఎరసాల మీదుగా వెళ్లే రసాపేట - కొత్తపల్లె నాలుగులేన్ల రోడ్డు

పోరుమామిళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి మైదుకూరుకు తక్కువ దూరం, వేగంగా ప్రయాణించేందుకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిర్మాణానికి మైదుకూరు నుంచి సీతారాంపురం వెళ్లే దారిలో జిల్లాసరిహద్దు వరకు రైతుల స్థల సేకరణ చేసింది. వారికి అవార్డు మంజూరైనా కొందరు రైతులకు రికార్డులు సరిగా లేకోవడంతో కొందరికి నష్టపరిహారం అందింది, మరికొందరికి డబ్బు అందాల్సి ఉంది. ఆర్డీఓ వెరిఫికేషన్ అయిన తరువాత వారికి అందే అవకాశాలున్నాయి. కానీ ఈ నిర్మాణం గతేడాది అక్టోబరులో ప్రారంభమైంది. 2026 ఏప్రిల్‌కు పూర్తిచేయాల్సి ఉంది. ఈ నిర్మాణం పూర్తయితే విజయవాడ - సింగరాయకొండకు, నేరుగా బెంగుళూరు నుంచి మైదుకూరుకు తక్కువ సమయంలో వెళ్లేందుకు అంచనాలు వేసి దాదాపు రూ.189 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఎద్దులాయపల్లె నుంచి సీతారాంపురం వరకు రోడ్డు విస్తరణ పనులు జరగాల్సి ఉంది. ఇందులో సీతారాంపురం వద్ద ఏడున్నర కిలోమీటర్లు అటవీశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. టేకూరుపేట చెక్‌పోస్టు నుంచి జిల్లా సరిహద్దు వరకు అనుమతులు ఇంకా రావాల్సి ఉంది. రంగసముద్రం బైపాస్ 1.8 కిలోమీటర్లు పెండింగులో ఉంది. ఇందులో రైతులకు నష్టపరిహారం అందాల్సి ఉండగా, రికార్డులు అందిస్తే ఆర్డీఓ వెరిఫికేషన్ అయిన తరువాత వీరికి పరిహారం అందే అవకాశం ఉంది. టేకూరుపేట నుంచి రజాసాహెబ్‌పేట వరకు ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నాయి. నర్సింగ్‌పల్లె నుంచి రంగసముద్రం వరకు నిర్మాణం జరగాల్సి ఉంది. ఈ రోడ్డు విస్తరణకు సంబంధించి 38.12 ఎకరాలు సంబంధించి 397 మంది రైతులకు ప్రభుత్వం రూ.9,92,40,120 అవార్డు ప్రకటించింది. కాశినాయన మండలానికి సంబంధించి 6.81 ఎకరాలకు 56 మంది రైతులకు రూ.86,80,251 అవార్డు ప్రకటించింది. బి.కోడూరు మండలానికి సంబంధించి 2.44 ఎకరాలకు సంబంధించి 44 మంది రైతులకు రూ.27,99,460లు అవార్డు ప్రకటించింది. పోరుమామిళ్ల మండలానికి సంబంధించి 16.54 ఎకరాలకు సంబంధించి 55 మంది రైతులకు రూ.3,61,16,678లు అవార్డు ప్రకటించింది. బి.మఠం మండలానికి సంబంధించి 12.33 ఎకరాలకు 242 మంది రైతులకు రూ.5,16,43,731లు అవార్డు ప్రకటించింది. ఇంకా ఇప్పటికీ 351 మంది రైతులకు రూ.7,62,96,346లు నష్టపరిహారం అందాల్సి ఉంది. ఈ రైతులకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేసి ప్యాకేజీ పొందాల్సి ఉంది. ప్రస్తుతం టేకూరుపేట చెక్‌పోస్టు సమీపంలో రజాసాహెబ్‌పేట నుంచి ఎరసాల మీదుగా అర్క్ వరకు నిర్మాణం జరుగుతున్నాయి. మధ్యలో బ్రిడ్జిల నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి 10 శాతమే పనులు జరిగాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. రైతులకు సంబంధించి పూర్తిగా నష్టపరిహారం అందించి నిర్మాణం వేగవంతం చేస్తే భవిష్యత్తులో మైదుకూరు నుంచి విజయవాడకు వెళ్లాలన్నా ఈ రహదారి సింగరాయకొండ మీదుగా విజయవాడ వెళ్లేందుకు విజయవాడ నుంచి మైదుకూరుకు అతి తక్కువ సమయం పట్టే అవకాశాలున్నాయి. ఈ వేసవిలో కల్లా అర్క్ పని పూర్తయితే వచ్చే కాలానికి పనులు మరింత వేగం అందుకోవచ్చు. గ్రావెల్‌కు సంబంధించి నీళ్లు చల్లాలని కొందరు చెబుతున్నారు. ఈ విషయం సంబంధిత శాఖ ఏఈ రామక్రిష్ణనాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఎప్పటికప్పుడు ట్యాంకర్లతో నీళ్లు చల్లుతున్నామని, దుమ్ము రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పనుల విషయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటే పనులు వేగంగా జరిగి ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.







నాలుగులేన్ల రహదారిపై బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాట్లు చేసిన దృశ్యం - మోరీలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం - టేకూరుపేట చెక్‌పోస్టు వద్ద జరుగుతున్న బ్రిడ్జిల నిర్మాణం

రెడ్లు సేవాతత్పరులు

రెడ్డి సేవాసమితి సేవలు ప్రశంసనీయం
రజతోత్సవాల్లో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డి



రెడ్డి సేవాసమితి రజతోత్సవాల్లో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డి

కడప కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రెడ్లు సేవాతత్పరులని, వివిధ రంగాల్లో ప్రశంసనీయమైన సేవలందిస్తూ సాగుతున్న రెడ్డిసేవా సమితి సేవలు ప్రశంసనీయమని ఏపీ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి కొనియాడారు. రెడ్డిసేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక డీఎస్ఆర్ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన సమితి రజతోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ ప్రోలయ వేమారెడ్డి మొదలుకుని నేటి వరకు అనేక మంది రెడ్లు దేశానికి సేవలందించారన్నారు. తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి మొదలుకుని తెలుగు నేలపై 11 మంది రెడ్లు ముఖ్యమంత్రులుగా సేవలందించారన్నారు. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మాట్లాడుతూ జిల్లాలో విశ్వవిద్యాలయానికి వైవీయూ పేరు పెట్టడం గర్వకారణమన్నారు. పది మందికి అన్నం పెట్టే గుణం రెడ్లకుందని, ఆ దిశగా సేవలందిస్తున్న రెడ్డి సేవా సమితి ఏర్పడడం రెడ్లకు తోడ్పాటన్నారు. రెడ్డిసేవా సమితి అధ్యక్షుడు ఆచార్య కుప్పిరెడ్డి నాగిరెడ్డి, వైవీయూ సహాచార్యులు కొవ్వూరు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పాతికేళ్లగా విద్యావసతిని కల్పించి ఎందరో విద్యార్థినులకు ఆశ్రయం కల్పిస్తున్న రెడ్డిసేవాసమితి సేవలు అభినందనీయమన్నారు. హంస అవార్డు గ్రహీత డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సేవాసమితి అభ్యుదయం దిశగా సేవలందించడం వెనుక నిర్వాహకుల కృషిని కొనియాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాలు రేపటి సమాజానికి మార్గదర్శకాలన్నారు. అతిథులను, మేలుకొలుపు సంపాదకులు డాక్టర్ భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కొండూరు జనార్ధనరాజు, చదలవాడ వెంకటేశ్‌ను రెడ్డి సేవా సమితి నిర్వాహకులు సత్కరించారు. మేలుకొలుపు సంచిక అతిధులచే ఆవిష్కరించబడింది. ప్రముఖ రచయిత పుత్తాపుల్లారెడ్డి రచించిన మహాభారత విజ్ఞాన సర్వస్వం పుస్తకాన్ని ఆవిష్కరించి పుల్లారెడ్డికి సాహిత్య రత్నాకర బిరుదు ప్రదానం చేశారు. ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, పముఖ జానపద పరిశోధకులు ఆచార్య చిగిచెర్ల క్రిష్ణారెడ్డి, కొండా లక్ష్మీకాంతరెడ్డి, యలమర్తి మధుసూదన్, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, గుడ్ల ఆదినారాయణరెడ్డి పద్మప్రియ చంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

200 క్యూసెక్కులు విడుదల

కొండాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ ద్వారా 200 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కమలాపురం రైతుల అవసరాల దృష్ట్యా ఈ నీటిని వదులుతున్నామన్నారు. కాగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేదన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 24.34 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

పారా స్పోర్ట్స్‌ను విజయవంతం చేయండి

కడప స్పోర్ట్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలను విజయవంతం చేయాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక రవీంద్రనగర్‌లోని అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ క్రీడల్లో విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 28న ఉదయం 10గంటల నుంచి మున్సిపల్ మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ఔత్సాహిక విభిన్న ప్రతిభావంతులు హాజరవాలని కోరారు. రన్నింగ్‌రేస్, త్రోబాల్ తదితర విభాగాల పోటీలు జరగనున్నాయన్నారు. వివరాలకు 9000672017, 9550878889, 9963194010 సంప్రదించాలన్నారు.

ప్రాణం తీసిన హెర్నియా ఆపరేషన్

సినిమాటిక్‌ను ప్రదర్శించిన డాక్టర్ ● ఆపరేషన్ సక్సెస్ అంటూ నమ్మబలికిన వైనం
ఆస్పత్రి వద్ద బాధితుల ఆందోళన ● రెండుగంటలు ట్రాఫిక్ జామ్
● పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వైనం





కేవీఆర్ హాస్పిటల్ వద్ద రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు - ఐసీయూలో రమాదేవి మృతదేహం

ప్రొద్దుటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హెర్నియా ఆపరేషన్ మహిళ ప్రాణం తీసింది. అయితే ఆపరేషన్ సక్సస్ అయిందని, పేషెంట్‌ను అబ్జర్వేషన్‌లో ఉంచాలని డాక్టర్ నమ్మబలుకుతూ సినిమాటిక్‌ను ప్రదర్శించారని, డాక్టర్ ప్రదీప్‌రెడ్డిని శిక్షించాలని బాధిత గ్రామస్తులు హాస్పిటల్ వద్ద నినాదాలు చేశారు. చివరికి పోలీసుల జోక్యంతో సర్దుబాటైంది. వివరాల్లోకెళితే...

ఎర్రగుంట్ల మండలం తుమ్మల పల్లెకు చెందిన వడ్డెరపు రమాదేవి హెర్నియా సమస్యతో జనవరి 16న గాంధీరోడ్డులోని కేవీఆర్ హాస్పిటల్‌లో చేరారు. వైద్య పరీక్షల అనంతరం ఆమెకు హెర్నియా ఆపరేషన్ చేయాలని తెలిపారు. దీంతో వారు ఆపరేషన్‌కు సిద్ధపడ్డారు. జనవరి 17న ఆపరేషన్ చేసి సక్సెస్ అయ్యిందని వైద్యులు తెలిపినట్లు రమాదేవి భర్త శ్రీనివాసులు వెల్లడించారు. అయితే రమాదేవిని ఐసీయూలో అబ్జర్వేషన్‌లో వుంచామని ఆమె ఆరోగ్యంగా వుందని నమ్మబలికారన్నారు. కానీ శనివారం ఉదయం నుంచీ ఆమెను చూసేందుకు అనుమతించమని కోరినా వారు చూపించకపోవడంతో రమాదేవికి ఏదో అయిందనే అనుమానం వచ్చిందన్నారు. దీంతో బంధువులు, ఊరి వారిని ఆస్పత్రి వద్దకు రావాలని చెబుతుండగానే ఆస్పత్రికి పోలీసులు వచ్చారన్నారు. అంతేకాకుండా ప్రైవేటు వ్యక్తులు పెద్దఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకున్నారన్నారు. దీంతో రమాదేవి మరణించిందని ఖరారు చేసుకున్నామన్నారు. జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వచ్చాక ఆయనతో పాటు మమ్మల్ని లోపలికి అనుమతించారన్నారు. ఆస్పత్రిలో రమాదేవి ఆపరేషన్ తరువాత మరణించడంపై కనీసం సమాచారం కూడా ఇవ్వని డాక్టర్, ఆస్పత్రి సిబ్బందిపై త్రీటౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా కనీసం ఫిర్యాదు స్వీకరించలేదని రమాదేవి భర్త ఆవేదన వ్యక్తం చేశారు. రమాదేవికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు వున్నాడని, భర్త జువారి ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడని మృతురాలి బంధువులు తెలిపారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున ఆందోళనలో డిమాండ్ చేశారు.

మహిళ మృతిపై కేవీఆర్ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ ప్రదీప్‌రెడ్డిని వివరణ కోరగా పేషంట్ రమాదేవి హెర్నియా సమస్యతో కడుపు నొప్పితో బాధపడుతూ వచ్చిందన్నారు. ఆమెకు చాలాకాలంగా హెర్నియా వుందని అనేకసార్లు స్కానింగ్ చేయించిన హిస్టరీ మాకు వారు తెలపలేదు. పరిస్థితి చూసి ఆమెకు ఆపరేషన్ చేయాలని కుటుంబసభ్యుల అనుమతి తీసుకొని చేశాం. దాదాపు మూడున్నర గంటల పాటు కష్టపడి ఆమెకు ఆపరేషన్ చేశాం. లోపల ప్రేవులు చాలా మడత పడ్డాయి. ఆపరేషన్ మాత్రం సక్సెస్ అయ్యింది. తరువాత ఆమెకు బీపీ పల్స్ డౌన్ అయ్యి శాచురేషన్ పాయింట్‌లు పడిపోయాయి. సీపీఆర్‌చేసి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేశాం కానీ ఫలితం లేకుండాపోయింది.

ఉరివేసుకుని వ్యక్తి మృతి

పెండ్లిమర్రి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మాచునూరు వాసి మాచునూరు శ్రీనివాసులు (37) శుక్రవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు శ్రీనివాసులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. శుక్రవారం రాత్రి మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

‘స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్’ విజయవంతం




కమలాపురం: ప్రతిజ్ఞ చేస్తున్న పారిశుధ్య కార్మికులు... కడప: పిచ్చిమొక్కలను తొలగిస్తున్న ఎక్సైజ్ సీఐ

కమలాపురం రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):కమలాపురం పట్టణ పరిధిలో నగర పంచాయతీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం విజయవంతమైందని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలను తొలగించి ఆ ప్రదేశంలో రంగు రంగుల ముగ్గులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కాల్వల్లోని పూడికతీత పనులను చేపట్టారు. వాటర్ ట్యాంకర్ శుభ్రం చేశారు. మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరీ పాల్గొని మాట్లాడారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడప క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కడప ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్ పేర్కొన్నారు. కడప జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ క్రిష్ణకుమార్ ఆధ్వర్యంలో అన్ని స్టేషన్ల పరిధిలో చెత్త ఏరివేత, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేశారు. రోడ్డుపై ఉన్న పిచ్చిమొక్కలను ప్లాస్టిక్ కవర్లను ఏరివేశారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

వల్లూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని కడప డివిజను పంచాయతీ అధికారి విజయబాస్కర్ అన్నారు. ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్’ కార్యక్రమాన్ని వల్లూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు.

ప్రజలందరూ పాల్గొనాలి

చెన్నూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ ‘స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్’లో పాల్గొనాలని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు అన్నారు. చెన్నూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దుదాం

పులివెందుల రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రం చేసి ఆరోగ్యకరమైన గ్రామాలుగా తీర్చిదిద్దుదామని ఎంపీడీవో రామాంజనేయరెడ్డి, ఈఓపీఆర్డీ శారద అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం అన్ని పంచాయతీలలో చేపట్టారు. పరిశుభ్రంగా ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు.

గుంతలు పడ్డ వృషభాచలేశ్వర ఆలయం రోడ్డు




ఎద్దుల కొండపై వృషభాచలేశ్వర ఆలయం(ఇన్‌సెట్) కొలువై ఉన్న వృషభాచలేశ్వర స్వామి... కంకర తేలిన ఎద్దుల కొండ రోడ్డు

● ఆలయానికి వెళ్లాలంటే భక్తులకు అవస్థలు

వేంపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన వృషభాచలేశ్వర దేవస్థానానికి వెళ్లే రోడ్డు గుంతలమయమై ఉంది. కొండపైకి ద్విచక్రవాహనాల్లో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి సందర్భంగా భక్తులు ఆలయానికి పెద్దఎత్తున వెళ్లారు. ‘అయ్యో వృషభాచలేశ్వరా... ఏమిటీ దుస్థితి.. అంటూ భక్తులు తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల ఆస్తులు ఉన్నప్పటికీ తారురోడ్డు కంకర తేలి ఉంది. దాని గురించి పట్టించుకునే వారే లేకపోవడం ఏమిటంటూ భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

గుంతల రోడ్డును పట్టించుకోండి

పాపాఘ్ని నది ఒడ్డు నుంచి ఆలయానికి చేరుకునే వరకు గతంలో తారు రోడ్డు నిర్మించారు. పైన ఆలయంలో లక్ష్మీవృషభాచలేశ్వర స్వామి కొలువై ఉన్నాడు. ఈ పురాతన ఆలయానికి దాదాపు 15ఏళ్ల క్రితం రోడ్డు నిర్మించారు. చాలా చోట్ల రోడ్డు గుంతలు పడింది. మరి కొన్ని చోట్ల పూర్తిగా దెబ్బతిని కంకరతేలి ఉంది. దీంతో ఈ రోడ్డున వెళ్లాలంటే ప్రమాదాలు జరుగుతాయని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇటు దేవస్థాన అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం స్పందించి నూతన రోడ్డును నిర్మిచాలని ప్రజలు కోరుతున్నారు.

తరతరాలకు చెరగని చరిత్ర ఎన్టీఆర్

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు మాధవి, క్రిష్ణచైతన్యరెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి





కడప: ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి.. కమలాపురం: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి... పులివెందుల: నివాళులర్పిస్తున్న బీటెక్ రవి

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తరతరాలకు చెరగని చరిత్ర ఎన్టీఆర్ అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి కొనియాడారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకొని కొండయ్యపల్లెలో ఎన్టీఆర్ విగ్రహ వ్యవస్థాపకుడు చలపతి ఆధ్వర్యంలో విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అలాగే ఎన్టీఆర్ సర్కిల్లో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పార్టీని స్థాపించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్దన్‌రెడ్డి, శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ టింబర్ డిపో శ్రీనివాసులు, బండి బాబు, మురళి, సుబ్బారెడ్డి, చల్లా రాజశేఖర్, బాలకృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

గొప్ప మానవతావాది ఎన్టీఆర్

● ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గొప్ప మానవతావాది స్వర్గీయ నందమూరి తారకమారావు అని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి అన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాలవారికి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన సమతావాది, స్త్రీలకు సాధికారతనిచ్చిన సంస్కర్త ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనలో అనుక్షణం పనిచేస్తామన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవం కోసం టీడీపీని స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, మండల కన్వీనరు రాఘవరెడ్డి, ఖాదర్‌బాషా, కంకర సుబ్బారెడ్డి, దివాకర్రెడ్డి, సూర్యసుబ్బారెడ్డి, మస్తానయ్య, చిన్న క్రిష్ణరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వాసు, ప్రభాకర్‌రెడ్డి, ఓబయ్య, ప్రభాకర్రెడ్డి, గంగాధర్‌రెడ్డి, శివమోహన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు జాతికి వన్నె తెచ్చిన మహానేత ఎన్టీఆర్: బీటెక్ రవి

పులివెందుల టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు జాతికి వన్నె తెచ్చిన మహానేత ఎన్టీఆర్ అని వక్తలు కొనియాడారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ బతికే ఉంటారు: అమీర్ బాబు

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సూర్యచంద్రులు ఉన్నంత వరకు ప్రజల గుండెల్లో టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు అన్నారు. కడపలోని ఎన్టీఆర్ సర్కిల్, కొండాయపల్లె ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండారెడ్డి, నాయకులు చలపతినాయుడు, శివరాం, సుబ్బయ్య, వెంకటేష్‌యాదవ్, రవిశంకర్‌రెడ్డి, శ్రీనివాసులుయాదవ్, భవాణి, శేషయ్యనాయుడు, జనార్దన్‌రెడ్డి, జయశేఖర్, వెంకటేశ్, రమణ, శ్రీనివాసులు, డాక్టర్ రమణ, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు టీఎన్ఎస్ఎఫ్ నివాళి

టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి సంర్భంగా కడప నగరంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ అధికార ప్రతినిధి జిలాన్, బిల్లా సీవన్, ఆసిఫ్, వెంకటేష్, షణ్ముఖ, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వికాస్ హరికృష్ణ

ఎన్టీఆర్ బాటలో నడుద్దాం: హరిక్రిష్ణ

కడప ఎడ్యుకేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ బాటలో నడుద్దాం అని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ అన్నారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలనలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రజల గుండెల్లో యుగపురుషుడిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రీసెంట్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భగా టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఐ.శివారెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పి.వెంకటసుబ్బారెడ్డి, మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, జిల్లా అధికార ప్రతినిధులు అక్బర్, వేల్పుల సుబ్రమణ్యం, పవన్‌కుమార్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ చిన్నయ్య, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఆర్.సుధాకర్‌రెడ్డి, గౌస్‌పీర్, డాక్టర్ పిచ్చయ్య నీటిసంఘం అధ్యక్షుడు గోదుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వల్లూరు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ వైద్యురాలు లక్ష్మీప్రసన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామక్రిష్టారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఓబులేసు, సుబ్బారెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్

కడప(వినాయకనగర్), జనవరి18(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన వ్యక్తి నందమూరి తారకరామారావు అని డిప్యూటీ మాజీ మేయర్ ఆరీఫుల్లా కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వేంపల్లె: వేంపల్లె టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

పెండ్లిమర్రి: టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేముల: వేములలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● అధిక లోడుతో ప్రయాణించవద్దు ● ఎంవీఐ బీవీ ప్రసాద్



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ ప్రసాద్

పులివెందుల టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు బీవీ ప్రసాద్ సూచించారు. రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా శనివారం పులివెందుల పట్టణంలోని ఆటో డ్రైవర్లు, వాహన డ్రైవింగు లైసెన్సు అభ్యర్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, నిబంధనలు అతిక్రమించరాదని, ప్రయాణికులను సురక్షిత గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. అధిక లోడుతో ప్రయాణాలు వద్దని డ్రైవర్లకు తెలిపారు. ఇద్దరి కంటే ఎక్కువ మందితో ద్విచక్ర వాహనంపై ప్రయాణించవద్దన్నారు. రహదారి నియమాలు పాటించాలని కోరారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మానసిక, శారీరక ఏకాగ్రత ఎంతో అవసర మన్నారు. ఇతర ఆలోచనలతో, అతి వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను ఆటోల్లో ఎక్కిస్తే కేసులు తప్పవన్నారు. అధిక సంఖ్యలో కూలీలను ఒకే వాహనంలో తీసుకెళితే ఆటో డ్రైవరుతో పాటు కూలీల మేస్త్రీపై కూడా కేసులు నమోదు చేయిస్తామన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మితిమీరిన వేగం ప్రమాదకరమన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు.

అనుకోకుండా ప్రమాదం జరిగితే హెల్మెట్ ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

‘రాహుల్ గాంధీపై ఆరోపణలు తగదు’

కడప కలెక్టరేట్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీపై ఆరోపణలు తగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి ఖండించారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆర్‌ఎస్ఎస్ ఛీప్ మోహన్ భగవత్ అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్టాపన రోజున దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని వ్యాఖ్యానించడంపై రాహుల్ గాంధీ స్పందిస్తూ భగవత్ వాఖ్యలు దేశద్రోహం కిందికి వస్తాయన్నారు. బ్రిటీష్ వారితో పోరాడిన యోధులను కించ పరచవద్దన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీ, లంక దినకర్‌లు రాహుల్ గాంధీపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. అసెంబ్లీ కో-ఆర్డినేటర్ జకరయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయకుమార్, కుళ్లాయప్ప, మైనుద్దీన్ పాల్గొన్నారు.

‘జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి’

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టు ఫోరం ప్రతినిధులు కోరారు. శనివారం మైదుకూరులో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. తమిళనాడు తరహాలో 60ఏళ్లు నిండిన జర్నలిస్టులకు పింఛన్ ఇస్తున్నారని, అదే తరహాలో ఏపీలో కూడా అమలు చేయాలని కోరారు. కవరేజ్ నిమిత్తం వెళ్లిన జర్నలిస్టులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, ప్రమాద బీమా ఇవ్వాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా అక్రిడేషన్లు మంజూరు చేశారని, ఇప్పుడు కూడా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు జర్నలిస్టు ఫోరం జిల్లా కన్వీనర్ శ్రీకాంత్, గౌరవ సలహాదారులు సుధీర్, ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ కిశోర్, కోకన్వీనర్ కృష్ణ, ఎలక్ట్రానిక్ మీడియా కోకన్వీనర్ రామచంద్ర, ఇతర టీజేఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధిపై సీఎంకు సీపీఐ లేఖ

కడప సెవెన్ రోడ్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయించి కడప ఉక్కు పరిశ్రమ, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్, ఏపీజీబీ ప్రధాన కార్యాలయంపై స్పష్టమైన ప్రకటన చేయాలని ముఖ్యమంత్రికి సీపీఐ బహిరంగ లేఖ రాసినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. కేసీ కెనాల్ చివరి ఆయకట్టు స్థిరీకరణ, రాజోలి 2.9టీఎంసీల సామర్థ్యం, గాలేరు నగరి, తెలుగుగంగ, హంద్రీనీవా రెండవ దశ పనులు, పంట కాల్వల నిర్మాణానికి పునరావాసం, పరిహారం నిధులు, సోమశిల భూ నిర్వాసితులకు ఉద్యోగాలు, శ్రీశైలం కనీస నీటిమట్టం 854 అడుగులు అమలు చేయాలన్నారు.మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు నిర్వహించాలని కోరారు.



దేవస్థానం స్థలంలో అక్రమ కట్టడాలు

సికెదిన్నె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దేవస్థానం స్థలంలో గుడి నిర్మిస్తే భక్తులకు అనుకూలంగా ఉంటుంది. కానీ గుడికి బదులు సమాధులు నిర్మిస్తూ అక్రమ కట్టడాలు కడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లి పొలంలోని సర్వే నంబరు 22/2లో 2.42 ఎకరాలు దేవస్థానం భూమి ఉండగా అక్కడ ఆంజనేయస్వామి ఆలయం, శివాలయం, అక్కదేవతల ఆలయాలు నిర్మించారు. ఇక్కడ భక్తులు పూజలు నిర్వహించడం చేస్తుంటారు. ఈ పరిసరాల్లోనే సమాధి కట్టి దాన్ని గుడి మాదిరిగా నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని, దీంతో కొత్తగా వచ్చే భక్తులు సమాధులు సైతం గుడి అనుకుని దర్శించుకునేందుకు వెళుతున్నారని భక్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి దేవస్థానం భూమిలోని అక్రమ కట్టడాలు తొలగించాలని కోరుతున్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి

వేంపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అయోధ్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో కడపలో ఈనెల 22న హిందూబంధువులంతా నిర్వహించే మహాశోభాయాత్ర, సీతారామ కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలలిన వజశ్వహిందూ పరిషత్ జిల్లా అద్యక్షులు చెన్నకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వేంపల్లె వేంకటేశ్వర స్వామి ఆలయంలో శోభాయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ గతేడాది నిర్వహించిన మాదిరిగానే ఈ ఏడాది జరుగుతుందని, జిల్లాలోని హిందువులంతా పాల్గొంచుకోవాలన్నారు. వీహెచ్‌పీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



శనివారం మైదుకూరులో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితో కడప జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో పాటు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, బీటెక్ రవి, అమీర్‌బాబు

కూరగాయల మార్కెట్ నిర్మాణానికి

ప్రభుత్వమే నిధులు మంజూరు చేయాలి

చంద్రబాబుకు విన్నవించిన ప్రవీణ్‌రెడ్డి



ప్రొద్దుటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు శివాలయం సర్కిల్లోని కూరగాయల మార్కెట్‌ను రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే పూర్తి చేయాలని మున్సిపాలిటీలో నిధులు లేవని టీడీపీ మాజీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి సీఎం చంద్రబాబుకు విన్నవించారు. శనివారం మైదుకూరు లో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన సీఎం చంద్రబాబును ప్రవీణ్‌కుమార్ రెడ్డి కలిశారు, అలాగే ప్రొద్దుటూరు లోపలు సమస్యలను చంద్రబాబు దృష్టికి తెచ్చారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెలవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజ, ప్రత్యేక అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 22న స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. అభిషేకంలో పాల్గొనదలచిన భక్తులు తెల్లవారుజామున 5.30గంటలకు ఆలయానికి చేరుకోవాలని కోరారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

ప్రొద్దుటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుజాతి మరువలేని మహనీయుడు స్వర్గీయ నందమూరి తారకరామారావని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పొట్టి రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలోమున్సిపల్ మాజీ చైర్మెన్లు వీఎస్ ముక్తియార్, ఆసం రఘురామిరెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి సర్పంచ్ శివచంద్రారెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి , టౌన్ బ్యాంకు చైర్మెన్ సుబ్బారెడ్డి, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు,హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కామిశెట్టి బాబు.ఎన్టీఆర్ అభిమాన సంఘం నేత సిద్దయ్య పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో శనివారం ఉదయం ఎన్టీరామారావు వర్ధంతిని ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయాన్నే దేవగుడి గ్రామం నుంచి టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణ రెడ్డి,అభిమానులు కాకార్యాలయం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి పెద్ద ఎత్తున అభిమానులు హాజరయ్యారు. జమ్మలమడుగు బ్లడ్‌బ్యాంకు ఇన్‌చార్జి నెల్సన్‌కుమార్, డాక్టర్ శ్రీలత, ప్రొద్దుటూరు డాక్టర్ దిలీప్ సమక్షంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 138 మంది రక్తదానం చేసినట్లు డాక్టర్ శ్రీలత, బ్లడ్‌బ్యాంకు ఇన్‌చార్జి నెల్సన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, జమ్మలమడుగు కూటమి నాయకులు, దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, మాలేపాడు మోహన్‌రెడ్డి, మునిస్వామినాయుడు, అంబవరం రామయ్య, పొన్నతోట శ్రీను, వంగల నాగేంద్రయాదవ్, బిర్రు సంతోష్, మోరగుడి జయుడు, నల్లగట్ల భూసిరెడ్డి, వరప్రసాద్ రెడ్డి, రాజారెడ్డి, కిరణ్‌రాయల్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని నందమూరి యువసేవా సమితి తెలుగుదేశం పార్టీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో పొట్టిపాడు రోడ్డులోని ఎన్టీరామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురప్పయాదవ్,నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేధికం సుదర్శన్, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జిల్లా తెలుగుయువత కార్య నిర్వాహక కార్యదర్శి రామూనాయుడు, సిద్దయ్య, లక్ష్మీనరసింహ, టప్పా మహబూబ్‌బాష, నాగభూషణం పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: తెలుగుజాతి వెలుగును ప్రపంచానికి చాటిన గొప్ప మహామనిషి నందమూరి తారకరామారావు అని టీడీపీ పట్టణాధ్యక్షుడు, ఎన్టీఆర్ అభిమానులు ఎస్.సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఎర్రగుంట్లలోని పిహెచ్‌సీకి వచ్చిన రోగులకు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్డును పంపిణీచేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని నివాళులు అర్పించారు. ఈకార్యక్రమం లో ఎన్‌టీఆర్ అభిమానులు రమేష్‌నాయుడు, నాగభూషణ్‌రెడ్డి, సురేష్, కొండారెడ్డి, మల్లేసు, రమేష్, కొండయ్య పాల్గొన్నారు.

మైలవరం..: గుడిపాడులో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా జరిపారు. తెలుగుదేశం మండల కన్వీనర్ బోరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు వేడుకలను జరిపారు. కార్యకర్తలు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు.

బద్వేలుటౌన్..: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీరామారావు అని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ,నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని నెల్లూరురోడ్డులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నేత బొజ్జ రోశన్న, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, మిత్తికాయల రమణ,సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, సీనియర్ న్యాయవాది పీవీఎన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, భూపేశ్‌రెడ్డి, నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌రెడ్డి తదితరులు



ప్రొద్దుటూరులో నివాళులర్పిస్తున్న నేతలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మైలవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పంచాయతీల్లో మురికి కాలువల తొలగింపు, పరిశుభ్రంగా ఉన్నచోట పరిశుభ్రంగా ఉంచడం తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముద్దనూరు..:మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పారిశుధ్య పనులను డీఎల్పీవో తిమ్మక్క పరిశీలించారు. రైల్వే బ్రిడ్జి వంక వద్ద, వెంకటరెడ్డి కాలనీలో కంపచెట్లు తొలగించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వీరభద్రుడు, ఈవో నరసింహులు ,సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: గ్రామాలన్నీ క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటునట్లు ఎంపీడీవో వెంకట రమణయ్య పేర్కొన్నారు. శనివారంమండలంలోని సున్నపురాళ్లపల్లె, చిలమకూరు, తుమ్మలపల్లె, నిడుజువ్వి గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సున్నపురాళ్లపల్లె సర్పంచు తొడిమె వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

అట్లూరు..: అట్లూరు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు.ఎంపీడీవో భాస్కర్‌బాబు, సిబ్బంది గ్రామస్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి శివప్రసాద్, సర్పంచ్ సుబ్బరాయుడు, పంచాయతీ సెక్రటరీ ఆనందరావు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: పోరుమామిళ్ల మండలంలోని టేకూరుపేటలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఆ పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలతో పాటు చర్చి సమీపంలో ఉన్న చెత్తకుప్పలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కల్లూరు రమణారెడ్డి పంచాయతీకార్యదర్శి రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే మండలంలోని 17 పంచాయతీల్లో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్‌లో భాగంగా శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి మూడో శనివారం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాలు చేపడతామని ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు.

బద్వేలు..:పరిసరాల పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని మున్సిపల్ సెక్రటరీలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సెక్రటరీలు,ప్రజారోగ్యసిబ్బంది కూరగాయల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం..: శనివారం టంగుటూరులో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో రమణారెడ్డి, ఈవోపీఆర్‌డి షాకీర్‌ఆలీఖాన్, సర్పంచ్ కరుణమ్మ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుత్తిదస్తగిరి, పంచాయతీ సెక్రటరీ బాబు, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

గోపవరం..: పరిశుభ్రత పరిరక్షణ ప్రధాన లక్ష్యం అని రాచాయిపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి నిఖిత అన్నారు. రాచాయిపేట గ్రామ పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు నాగేంద్ర, మణి ఇంజనీరింగ్ అసిస్టెంటు రవి, డిజిటల్ అసిస్టెంటు విజయ్‌కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛతలో అందరినీ భాగస్వామ్యులను చేసే వినూత్న కార్యక్రమమే స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమమని ఎంపీడీఓ మల్లీశ్వరి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చింతల చెరువులు బీసీ కాలనీలో స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించి, అనంతరం ప్రజా ప్రతినిధులు, ప్రజలతో కలసి నీటి ట్యాంకును శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రమీల, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శి తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మైలవరం..తలమంచిపట్నం గ్రామంలో మురుగు కాలువలు శుభ్రం చేస్తున్న దృశ్యం, బద్వేలు... చింతల చెరువు బీసీ కాలనీలో శుభ్రం చేస్తున్న ఎంపీడీఓ మల్లీశ్వరి, గ్రామ ప్రజలు

నేడు బీసీ సంక్షేమ సంఘం ఆవిర్భావ సభ



చౌడేశ్వరీ దేవాలయం వద్ద బీసీ సంఘం నాయకుల ఐక్యతారాగం

జమ్మలమడుగు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని నాగులకట్ట వీధి శ్రీ చౌడేశ్వరీదేవి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు జమ్మలమడుగు నియోజకవర్గ బీసీ సంక్షేమసంఘం ఆవిర్భావ సభ జరుగుతుందని అధ్యక్షుడు చౌడం జొల్లు కొండయ్య, బీసీ చేనేత ఐక్యవేదిక జాతీయ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటా రామదాసు తెలియజేశారు. నియోజకవర్గంలోని బీసీ సంఘం సోదరులు ఈ కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు పెద్దకంబయ్య, బీసీ సంఘం గౌరవాధ్యక్షులు బడిగించల చంద్రమౌళి పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): డీఈవో పూల్‌లో ఉన్న భాషా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర భాషోపాధ్యాయసంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్‌కొండయ్య మైదుకూరులో చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిట్లు పదోన్నతులు లేక ప్రతిసారి బదిలీలను స్థానచలనం చెందుతున్నారని పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో బదిలీలు జరిగే అవకాశం ఉన్నందున ఈలోపుగానే భాషా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి పదోన్నతులు కల్పించాలని కోరారు.

జ్యోతి క్షేత్ర సమస్య సీఎం దృష్టికి తీసుకెళ్లిన నేతలు

కాశినాయన జనవరి18 (ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలంలోని జ్యోతి క్షేత్రంలో అవధూత కాశినాయన గుడినిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అటవీ అనుమతులు ఇప్పించాలని శనివారం బద్వేల్ టీడీపీ నాయకురాలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ సమన్వయ కర్త రితీష్‌రెడ్డి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు వడ్డమాను రాజారెడ్డి,కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి తెలిపారు. ఒకరోజు పర్యటనలో భాగంగా మైదుకూరుకు వచ్చిన సీఎం చంద్రబాబును కలిసి గుడి సమస్యను వివరించామన్నారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానన్నారు.

అమరావతిని ఫ్రీజోన్ చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిని ఫ్రీజోన్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్ పేర్కొన్నారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ 15వ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు శరత్‌కుమార్, దస్తగిరి, చాంద్‌బాష, రమేష్, రాజా, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీలో ఉన్న ఖాదర్‌బాద్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి భూమిపూజ నిర్వహించారు. శనివారం సుమారు రూ.15 లక్షల వ్యయంతో ఖాదర్‌బాద్‌లో ఉన్న పాఠశాలకు వెళ్లే దారిలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు.

ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సీపీఐ నాయకులు శనివారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు ఉక్కు ఫ్యాక్టరీపై మాటలతో సరిపెడుతున్నారే కానీ ఏర్పాటుపై చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీను, చంద్రశేఖర్, మద్దిలేటి, పీటర్, వాసు, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించి- దేశాన్ని కాపాడండి



మాట్లాడుతున్న నాయకులు

బద్వేలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీ కర్నూలులోని అంబేడ్కర్ భవన్‌లో రాయలసీమ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కడప జిల్లా కన్వీనర్ బందెల ఓబయ్య పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో రాయలసీమ రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశరక్షణకోసం భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్రశేఖర్, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధి చెందాలి

పోరుమామిళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్రాభివృద్ధి చెందాలని సీపీయం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక సీపీయం కార్యాలయంలో జిల్లా సమగ్రాభివృద్ధి జరగాలని కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీయం నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేత పాయలకుంట్ల జట్టు



బి.కోడూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా బి.కోడూరులో తాలుకాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. పదిరోజుల నుంచి జరుగుతున్న క్రికెట్ పోటీల్లో శనివారం పాయలకుంట్ల జట్టు ప్రథమ బహుమతి అందుకుంది. అలాగే బి.కోడూరు జట్టు ద్వితీయ బహుమతి అందుకుంది. కాగా మొదటి బహుమతి రూ.20,116, ద్వితీయబహుమతి రూ.15,116 అందుకున్నారు. బి.కోడూరు గ్రామంలో జరిగిన ఈ క్రికెట్ పోటీలకు గ్రామస్థులు సహకారం అందించి ఎలాంటి అవకతవకలు జరగకుండా సక్రమంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.




శనివారం మైదుకూరులో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్ యాదవ్, ఆదినారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, భూపేశ్‌రెడ్డి తదితరులు